క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ఐజీ హెచ్‌ఎస్, మధుబన్ కాలనీ, పద్మాశాలిపురం, ఆప్కోకాలనీ, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత నైపుణ్య శిక్షణ

బండ్లగూడ: నిరుద్యోగ యువతకు ఎలక్ట్రానిక్స్ రంగంలో నైపుణ్య శిక్షణను ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సరస్వతీ విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్ రంగానికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని చక్కటి శిక్షణతో పదో తరగతి విద్యార్థులతో కస్టమ్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఎంఆర్) శిక్షణ ఇస్తున్నామన్నారు. పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించిన వారికి రెండు నెలల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. 18–25 ఏళ్లున్న యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సు చేసిన వారికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని అవసరాలకు అనుగుణంగా కోర్సును రూపొందించి నైపుణ్యవంతమైన శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 63099 87155, 80080 44326 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వినతి



మల్కారం సబ్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేత

శంషాబాద్ రూరల్: మండలంలోని బౌటిగూడలో నెలకొన్న విద్యుత్ సరఫరాలో సమస్యను పరిష్కరించాలని స్థానికులు మల్కారం సబ్‌స్టేషన్‌లో శనివారం వినతిపత్రం అందజేశారు. చిన్నపాటి గాలులకు తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతే గ్రామస్తులందరం కలిసి ఈ సమస్యను గుర్తించామన్నారు. సిబ్బంది కొరత పేరుతో అధికారులు సమస్యను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు శ్రీకాంత్, తదితరులున్నారు.

కేసీఆర్ అవినీతికి చరమగీతం పాడాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్

రాజేంద్రనగర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ మాణిక్యమ్మ కాలనీలో బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు శనివారం మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ 9 ఏళ్ల అభివృద్ధిపై ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాబురావు, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మల్లేష్, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈ.వేణుగోపాల్, రాజు, జంగయ్య, భాస్కర్‌యాదవ్, బూత్ అధ్యక్షుడు జగదీష్, భాస్కర్ తదితరులున్నారు.

నేడు కోకాపేట్‌లో గౌడ్‌భవన శంకుస్థాపన

మణికొండ: రాష్ట్రంలోని గౌడ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ట్రస్ట్ భవన నిర్మాణ శంకుస్థాపన చేపడుతున్నామన్నారు. జిల్లాలోని గౌడ్‌లు పెద్దఎత్తున తరలి రావాలని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతారని సమాచారం.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మణికొండ: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిరేవుల వాగు వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఉంటే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వేయరా..!

బండ్లగూడ: గత నాలుగేళ్లుగా గోతులమయమైన రోడ్లతో 22 కాలనీల ప్రజలు సతమతమవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగి చివరకు రోడ్డుపై ఆందోళనకు దిగారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ రాక్‌చర్చ్ ప్రధాన రహదారిపై శనివారం ఉదయం రోడ్డుపై నిలిచిన వర్షం నీటిలోనే కూర్చొని నిరసన తెలిపారు. కిస్మత్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ బీజేపీ నాయకుడు శేఖర్‌ముదిరాజ్, ఓంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ వార్డు సభ్యుడు నవీన్‌కుమార్‌ముదిరాజ్‌లు మాట్లాడుతూ.. కిస్మత్‌పూర్ నుంచి రాక్‌చర్చ్ మీదుగా ఎక్సైజ్ పోలీస్ అకాడమీకి వెళ్లేందుకు ప్రధాన రహదారిని గతంలో నిర్మించారన్నారు. పంచాయతీగా ఉన్న సమయంలో మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించారన్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న దాదాపు 22 కాలనీలకు ప్రధాన రహదారిగా మారిందన్నారు. రోజురోజుకు కాలనీలు అభివృద్ధి చెందుతుండటంతో ఈ రోడ్డు రద్దీగా మారిపోయింది. ఈ రోడ్డుపై ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని ఎమ్మెల్యేతో పాటు అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేకుండాపోయిందని స్థానికులు వాపోతున్నారు. కొత్తగా ఆ ప్రాంతంలో 40 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణం సాగుతుందని ఈ నిర్మాణానికి వచ్చే భారీ వాహనాలతో రోడ్డు మరింత అధ్వానంగా మారిందన్నారు.



కిస్మత్‌పూర్ రహదారిపై నిలిచిన వర్షం నీటిలో కూర్చుని నిరసన తెలుపుతున్న దృశ్యం

గోతుల్లో నిలుస్తున్న వర్షం నీరు..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లు పూర్తిగా జలమయమైపోయాయి. రోడ్డుపై గోతులు పడటం అందులో వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో ఆ దారిగుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ సమయంలో వేసిన రోడ్డు ఇప్పటికి కొనసాగుతుందని కార్పొరేషన్ ఏర్పడి మూడేళ్లైనా.. రోడ్డు వేయడం లేదని ఆరోపించారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించాలని లేనిపక్షంలో తామే చందాలు వేసుకుని రోడ్డు వేయించుకుంటామని స్థానికులు మండిపడుతున్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

శంషాబాద్: విధి నిర్వహణలో భాగంగా పనిచేస్తున్న ఓ యూట్యూబ్ ఛానెల్ వీడియోగ్రాఫర్ అజయ్‌ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసి కులం పేరుతో దూషించినందుకు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ముదిరాజ్ సంఘం జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బైరమోని మల్లేష్, మహాసభ నాయకుడు సిద్దేశ్వర్ మాట్లాడారు. బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్, మెరుగు సురేష్, బిక్షపతిముదిరాజ్, సిద్దులు, ఆనంద్ పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముదిరాజ్ మహాసభ నేతలు

ఇస్కాన్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: ఇస్కాన్ సంస్థ సమాజంలో శాంతి, ప్రేమ, సమభావనను తీసుకురావడానికి ఎంతగానో కృషి చేస్తుందని మందిర మేనేజర్ సచినందన్ హరిదాస్ వెల్లడించారు. హరే కృష్ణ మంత్రం జపించడం, భగవద్గీత సందేశాన్ని ప్రచారం చేయడం ఇస్కాన్ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. అత్తాపూర్‌లోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ చేపట్టారు. దారి పొడవున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారని వేలాది మందికి ఇస్కాన్ స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

శంషాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, ఉర్దూమీడియంతో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలు, యునిఫాంలను అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అక్రమ్ సూచించారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులను పంపిణీ చేసినట్లు వివరించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నరహరి తదితరులున్నారు.



ఏఎస్‌బీఎల్ సీఈవో అజితేష్ కొరుపోలు శనివారం హెచ్‌ఐసీసీలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఈటీ ఎక్సలెన్స్ అవార్డ్స్–23 కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఎమర్జింగ్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్–23 అవార్డును అందుకున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



వీధి దీపాలకు మరమ్మతులు



రాజేంద్రనగర్: ప్రజల ఇబ్బందులను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయిమాలిక్ అన్నారు. బుద్వేల్ బన్సీలాల్‌నగర్ ప్రధాన రహదారిలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వారు శనివారం మరమ్మతు పనులను చేయించారు. గత కొన్ని రోజులుగా వీధిదీపాలు పని చేయకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారని ప్రస్తుతం కొత్తవాటిని ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైందన్నారు.

హెచ్‌సీయూ వీసీని కలిసిన ఎన్‌ఎస్‌యూఐ బృందం



వీసీ ప్రొఫెసర్ బీజేరావుతో ఎన్‌ఎస్‌యూఐ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావును నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) హెచ్‌సీయూ నూతన కార్యవర్గ సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం శనివారం కలిసింది. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా హెచ్‌సీయూ భూ ఆక్రమణలు, క్యాంపస్‌లో క్రీడా సౌకర్యాలు మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు. యూనివర్సిటీ అడ్మిషన్స్‌కి అప్లికేషన్ ఫీజు తగ్గించడం అంశాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. క్యాంపస్‌లోని అటవీ ప్రాంతాన్ని పరిరక్షించి జింకల మరణాలు పూర్తిగా తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా అకడమిక్ యూనిట్లను తూర్పు క్యాంపస్‌కు మార్చడంపై కూడా తగిన విద్యార్థులకు న్యాయం చేసేలా చూడాలని కోరారు. వీసీని కలిసిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు షరీఫ్, ప్రధాన కార్యదర్శులు అజయ్, రచన, ఉపాధ్యక్షుడు అంజన్ పాల్గొన్నారు.

ప్రహరీ తొలగింపు.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్: ప్లాటు చుట్టూ ఏర్పాటు చేసిన ప్రీకాస్ట్ ప్రహరీని దౌర్జన్యంగా కూల్చివేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని అన్సారీరోడ్డు ప్రాంతంలో నివాసముండే షాహెదకు మండలంలోని బోటిగూడలో గుల్జార్ కాలనీ వెంచరులో 200 గజాల ప్లాటు ఉంది. ఈ స్థలంలో ఈ నెల 6న ప్రీకాస్ట్ పనులు చేస్తుండగా.. కొంతమంది వచ్చి బెదిరించి, డబ్బులు అడిగారు. ఆమె 100కు డయల్ చేయగా.. పోలీసులు వచ్చేసరికి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 22న ప్లాటు చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చివేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నేనావత్ బాల్‌రాజ్, రితిష్‌ఠాగూర్ వారి అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా



గచ్చిబౌలి: సమీక్షా సమావేశంలో తిట్టడమే కాకుండా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ టీఎస్ఎస్‌పీడీసీఎల్ గచ్చిబౌలి డీఈ గోపాల కృష్ణ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగామని యూనియన్ నాయకులు తెలిపారు. శనివారం లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జేఎల్‌ఎం, పీఎంఆర్, జెఏఓ, సీనియర్ అసిస్టెంట్లు విధులు బహిష్కరించారని చెప్పారు. తారానగర్ సబ్ స్టేషన్ పరిధిలో జి.వెంకట్ రెడ్డి లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారని, ముగ్గురు లైన్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో బిల్లుల కలెక్షన్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 22న గచ్చిబౌలి డీఈ గోపాలకృష్ణ సెక్సెస్ రివ్యూ నిర్వహించారని పేర్కొన్నారు. బిల్లుల కలెక్షన్ విషయంలో మాట్లాడుతుండగా వెంకట్‌రెడ్డిని తిట్టడంతో మనస్తాపనికి గురై సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారని తెలిపారు. 23న వెంకట్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈ గోపాలకృష్ణ ఆర్డర్ ఇవ్వడంతో 11024,327 యూనియన్లు, ఎస్‌సీఎస్‌టీ అసోసియేషన్, సీఐటీయూ సంఘాలు విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. బేషరతుగా సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జేవీ రామ్మోహన్, శ్యామ్ సుందర్, గోపాల్, శ్రీను, నర్సయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్‌లో ప్లాట్లు కబ్జా చేసిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్: ప్లాట్లను అక్రమంగా కబ్జా చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కారం రెవెన్యూ పరిధిలో లక్ష్మీ మెగా గ్రీన్ డెవ్లర్ పేరుతో 2005లో ఫాంలాండ్ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ప్లాటు కొనుగోలు చేసిన నగరవాసి జి.దేవేందర్‌రెడ్డి తన కూతురు బద్దం నివేదిత పేరున వేయి గజాల ప్లాటును 2013లో గిఫ్ట్ డీడ్ చేయగా.. ఆమె ప్లాటు చుట్టూ కడీలను ఏర్పాటు చేసుకున్నారు. వారం రోజుల క్రితం కొంతమంది హద్దులను తొలగించి ప్లాటును కబ్జా చేశారు. ఈ ప్లాటుతో పాటు మరో 80 ప్లాట్లను కూడా ఇదే తరహాలో కబ్జా చేసినట్లు బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సబ్జెక్ట్ పై పట్టు ఉంటేనే అవకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

మణికొండ: విద్యార్థులకు అన్ని శాస్త్రాలపై పట్టు ఉంటేనే ఉద్యోగావకాశాలు ఎక్కువగా వస్తాయని జేఎన్‌టీయూ గణిత ప్రొఫెసర్ ఎం.ఏ శ్రీనివాస్ రావు అన్నారు. జేఎన్‌టీయూ నిర్వహణ శాస్త్ర అధిపతి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఏఆర్ ఆర్యశ్రీ, ఎన్ఐటీ వరంగల్ ఇంగ్లిష్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా విశ్వనాథన్ పాల్గొని మాట్లాడారు. ఎంజీఐటీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంజినీరింగ్ విద్యలో గణిత, ఆంగ్ల, నిర్వహణ శాస్త్రాల ఔచిత్యంపై జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. ఆ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించడంతో పాటు నిరంతరం శ్రమిస్తేనే అద్భుత విజయాలు సాధిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డిలు అన్నారు. ఎంజీఐటీ గణిత విభాగాధిపతి ప్రొఫెసర్ రాజిరెడ్డి పదవీవిరమణ చేయటంతో ఆయనను అధ్యాపకులు, విద్యార్థులకు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కాన్ఫరెన్స్ చైర్మన్ హరిలీల, కన్వీనర్లు, కో– కన్వీనర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో డ్రగ్స్‌పై అవగాహన



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

మణికొండ: ఎంజీఐటీ కళాశాలలో యాంటీ నార్కొటిక్ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం రాష్ట్ర యాంటీ నార్కొటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన హైబ్రిడ్ వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డిలు వీడియోల ద్వారా విద్యార్థులకు వాటి వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బాల్‌రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ రవిచందర్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింహ చెరువు భూమి సర్వే



నర్సింహ చెరువు భూమిని సర్వేచేస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ పరిధిలో ఉన్న నర్సింహ చెరువు భూమిని సాగునీటి శాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఇరిగేషన్ ఏఈ మౌనిక ఆధ్వర్యంలో శనివారం సిబ్బంది చెరువు స్థలాన్ని సర్వే చేశారు. సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో శిఖం, పట్టా భూములున్నాయి. గతేడాది భారీగా కురిసిన వర్షాలతో చెరువు నిండటంతో ఎగువన ఉన్న ఔటర్ జంక్షన్‌లో ఎగ్జిట్–15 వద్ద కొన్ని నెలలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో చెరువు కట్టను కొద్దిగా తొలగించి నీళ్లను కిందకు వదిలారు. చెరువు చుట్టూ ఉన్న పట్టా భూముల్లో చెరువు నీరు రాకుండా ఎత్తు పెంచడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు కబ్జా కావడంతో వరదనీటికి అడ్డంకిగా ఉందంటూ గతంలో రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా.. చెరువు భూమి సర్వే చేపట్టి త్వరలోనే హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామని ఏఈ ప్రకటించారు.

నేటి నుంచే టీ–9 గోల్ఫ్ చాలెంజ్ టోర్నీ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో యువ గోల్ఫర్లను ప్రోత్సహించేందుకు టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న టీ–9 చాలెంజ్ టోర్నీ రెండో ఎడిషన్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొంటున్నాయి. దీనికి సంబంధించి ట్రోఫీని టీ గోల్ఫ్ ఫౌండర్ ఎస్ఆర్ఎస్ రెడ్డి, మాజీ క్రికెటర్లు చాముండి, వెంకటపతిరాజు, టోర్నీలో ఆడుతున్న జట్ల కెప్టెన్లతో కలిసి ఆవిష్కరించారు. 3 వారాల పాటు 9 రౌండ్లలో టోర్నీ జరగనుండగా... మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్ ఆడతాయి. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలతో పాటు రూ. 10 లక్షల ప్రైజ్‌మనీ దక్కనుంది. బౌల్డర్ హిల్స్ టైగర్స్ టీమ్‌కు మాజీ క్రికెటర్ చాముండి ఓనర్‌గా ఉండగా.. రైడర్స్, బౌల్డర్ నంజాస్, ఎకోలాస్టిక్ ఈగల్స్, జాగృతి జాగర్స్, నోవాటెల్ స్టార్స్, సిమెట్రిక్స్, టీజీఎఫ్ బ్యాక్ స్పిన్నర్స్ జట్లు పాల్గొంటున్నాయి. క్రికెట్‌లో టీ ట్వంటీ ఫార్మాట్ తరహాలోనే టీ9 ఛాలెంజ్ నిర్వహిస్తున్నట్లు టీ గోల్ఫ్ ఫౌండర్ ఎస్ఆర్ఎస్ రెడ్డి చెప్పారు. తొలి ఎడిషన్‌లో బౌల్డర్ హిల్స్ టైగర్స్ విజేతగా నిలిచింది.

అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన అవసరం

ఇండియన్ ఐడల్ విజేత, ప్రముఖగాయకుడు రేవంత్



విద్యార్థులతో ప్రముఖ సింగర్ రేవంత్

రాయదుర్గం: అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఇండియన్ ఐడల్ విజేత, ప్రముఖ గాయకుడు రేవంత్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలో ప్రముఖ స్టార్టప్ 'వాట్ ఈజ్ మై గోల్' ఆధ్వర్యంలో శనివారం అండర్–18 సింగర్స్ ఈ కమ్యూనిటీని ఇండియన్ ఐడల్ విజేత, ప్రముఖ గాయకుడు ఎల్.వి. రేవంత్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్కూల్ పిల్లలతో ఇంటరాక్ట్ కావడం సంతోషంగా ఉందన్నారు. వాట్ ఈజ్ మై గోల్ స్టార్టప్ సహ వ్యవస్థాపకురాలు చిత్రలిశర్మ మాట్లాడుతూ... విద్యార్థులు విభిన్న అనుభవాలను పొందగలిగేలా, కీలకమైన రంగాలలో దృష్టి సారించేలా చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు రోబాటిక్స్, ద్విచక్ర వాహన ప్రదర్శన, అవగాహన కల్పించారు. అనంతరం రేవంత్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో లబ్ధిదారుడు గోల్కొండకు చెందన తౌఫిక్ ఖాన్‌కు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఎల్‌ఓసీను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల శస్త్ర చికిత్సకు సీఎం ఆర్ఎఫ్ పథకం ఎంతో ఉపయోగకరమన్నారు.



ఇంటింటికీ బీజేపీ



గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలీయంగా ఉందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్ సింగ్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలో జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడీ ఆధ్వర్యంలో దేశం విజయపథంలో ముందుకు సాగుతుండగా తెలంగాణలో బీఆర్ఎస్ అవినీతి పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఆయన అన్నారు.

గోల్కొండ కోటలో పాము కలకలం

గోల్కొండ: గోల్కొండ కోటలో ఓ నాగు పాము కలకలం సృష్టించింది. కోటలోని సౌండ్ అండ్ లైట్ షో వద్ద ఈ పాము సంచరిస్తుండగా పోలీస్ కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్ చాకచక్యంగా దానిని పట్టుకున్నారు. బోనాల సందర్భంగా ప్రతి ఏటా పాములను పట్టుకోవడంలో నైపుణ్యం ఉన్న వెంకటేష్‌నాయక్‌ను పోలీస్ శాఖ వారు పామును పట్టుకోవడానికి కోటకు పంపుతారు. ఆదివారం గోల్కొండ కోట 2వ బోనం జరగనుండగా వెంకటేష్‌నాయక్ శనివారం సౌండ్ అండ్ లైట్ షో వద్ద పాము అటు నుంచి పోతుండగా దానిని బంధించాడు. పామును వెంకటేష్ నాయక్ సంబంధిత అధికారులకు అప్పగించారు.

